క్లుప్తంగా

ఎంపీకి సత్కారం



నెల్లూరు రూరల్: క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని ఆయన నివాసంలో శనివారం కలిసి సమస్యలను తెలియజేశారు. 29వ డివిజన్లోని గాంధీనగర్‌లో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

ఇందుకూరుపేట: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలని ముత్తుకూరు సెబ్ సీఐ బాలకృష్ణ సూచించారు. మైపాడులో మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ ఎస్పీ (అడ్మిన్) హిమవతి ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే సమాజంలో గౌరవం కోల్పోతారన్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నా, తీసుకుంటున్నా టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమణయ్య, సర్పంచ్ వెంకయ్య పాల్గొన్నారు.

జాతర ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

విడవలూరు(కోవూరు): విడవలూరు మండలం పెద్దపాళెంలో గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవాన్ని ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్ద కాపులు తెలిపారు. శనివారం పోలేరమ్మ జాతర ఆహ్వాన పత్రికలను ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. సర్పంచ్ మేకల పోలయ్య, పెద్దకాపు కొండూరు శ్రీనివాసులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

కోవూరు: గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు కోరారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బ రైతు భరోసా కేంద్రంలో కోవూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వీఏఏలకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో ఈ-పంట నమోదు ప్రారంభమవుతుందన్నారు. అందువల్ల ఇప్పటి నుంచే రైతుల వివరాలను సేకరించుకోవాలని సూచించారు. ఈ నెల 30న ప్రభుత్వం రైతు భరోసా-పీఎం కిసాన్ నగదును విడుదల చేయనుందని తెలిపారు. అనంతరం జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు సత్యవాణి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతులను సేంద్రియ సాగు పద్ధతుల వైపు ప్రోత్సహించాలని కోరారు. ఏఓలు లక్ష్మీమాధవి, సుజాత, చక్రవర్తి, కృష్ణయ్య, ఇందిరావతి, తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సీడ్స్ కేంద్రంలో తనిఖీ

పాటూరులోని సింహపురి సీడ్స్ కేంద్రాన్ని జేడీఏ సుధాకర్‌రాజు శనివారం తనిఖీ చేశారు. సీడ్స్ నాణ్యతను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని సూచించారు.

వివాదాస్పద భూమి సర్వే

ఇందుకూరుపేట: డేవిస్‌పేటలోని వివాదాస్పద భూమిని జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీరామమూర్తి, మండల సర్వేయర్ హరనాథ్ శనివారం సర్వే చేశారు. ఈ ప్రాంతంలో ఎస్తేరురాణి అనే మహిళ నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించగా, స్థానికులు దేవాదాయశాఖకు చెందిన భూమి అని అడ్డుకున్నారు. దీంతో ఆమె అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు భూమి దేవాదాయశాఖకు చెందినదా..కాదా అనే కోణంలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై వెంకటరాజేష్ పర్యవేక్షించారు.

బస్టాండ్‌లో సెబ్ అధికారుల తనిఖీలు

పొదలకూరు : స్థానిక పంచాయతీ బస్టాండ్ పరిసరాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారని స్పందనలో వినతిపత్రం అందడంతో పొదలకూరు సెబ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. బస్టాండ్‌లోని కూల్ డ్రింక్ షాపులు, వెలుపుల కూరగాయల తోపుడు బండ్లను తనిఖీ చేశారు. ఎటువంటి అక్రమ మద్యం లభ్యం కాలేదని సెబ్ సీఐ వెంకట్రావు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్సై సీహెచ్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 17వ డివిజన్లోని ఆకుతోటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి వారికి కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, కార్పొరేటర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 41వ డివిజన్లో రూ.20 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను స్థానిక నేతలు గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్పొరేటర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డస్ట్ బిన్లను తప్పక ఏర్పాటు చేసుకోవాలి

నెల్లూరు(బారకాసు): తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని, అదే విధంగా అపార్ట్‌మెంట్లలో డస్ట్ బిన్లను తప్పక ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఫతేఖాన్‌పేట, రైతుబజార్, టెక్కేమిట్ట, మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, క్రాంతినగర్, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడికతీత పనులను చేపట్టడంతో పాటు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. వీధుల్లోని లిఫ్ట్ పాయింట్ల వద్ద నుంచి చెత్తను సేకరించొద్దని, ఇంటింటి చెత్త సేకరణ మాత్రమే జరిగేలా చూడాలని చెప్పారు. డివిజన్ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులను జారీ చేయాలని సూచించారు. అనంతరం సరస్వతీనగర్‌లోని అపార్ట్‌మెంట్ వాసులతో ముచ్చటించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయొద్దని, నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

సచివాలయాల్లో తనిఖీలు

మెక్లిన్స్ రోడ్డు, అరిగెలవారివీధిలోని వార్డు సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని కార్యదర్శులకు సూచించారు.

ఘనంగా మోచర్ల జయంతి సభ



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక మందిరంలో సాహితీవేత్త మోచర్ల రామకృష్ణయ్య 119వ జయంతిని నెల్లూరు వర్ధమాన సమాజ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రామకృష్ణ సేవా సమితి నగర శాఖ ఉపాధ్యక్షుడు సాయికుమార్‌రెడ్డి, సమాజ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్ వర్ధంతి సభ నేడు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): డాక్టర్ విజయ్‌కుమార్ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించనున్నామని జీవీకే ట్రస్ట్ సభ్యుడు నారాయణ పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని విజయ్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ భవనంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని దేవిశెట్టి స్వాములు, రాజేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రజాసంఘాలు, మేధావులు హాజరుకావాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు బ్రాహ్మణి, అబ్బయ్యరెడ్డి, మాల్యాద్రి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

2న ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు(వేదాయపాళెం): పదో తరగతి పరీక్షల్లో 500కుపైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను జూన్ రెండున అందజేయనున్నామని యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పొగతోటలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విజయమహల్ గేట్ సమీపంలోని ఎమ్మీఎస్ కల్యాణ మండపంలో పురస్కారాలను అందజేయనున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని, వివరాలకు 97058 00794, 94406 33704 నంబర్లను సంప్రదించాలని సూచించారు. యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్ నాగకిశోర్, యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు మధుసూదన్‌రావు, రాజేష్, రమణయ్య, కొండయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టరూ..

నెల్లూరు (టౌన్): ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు జిల్లా విద్యా శాఖ చర్యలు చేపట్టాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి కోరారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవానీకి వినతిపత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫీజుల రిజర్వేషన్ వివరాలను ప్రైవేట్ పాఠశాలల్లో నోటీస్ బోర్డులపై ఉంచాలని కోరారు.

విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కోశాధికారి కమలాకర్, ఉపాధ్యక్షులు మహేష్ కుమార్, శ్రీనివాసరెడ్డి, మాల్యాద్రి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న రంగారెడ్డి



46వ డివిజన్లో..

నెల్లూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సజావుగా అందిస్తున్న వలంటీర్ల సేవలను విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి అభినందించారు. 33వ డివిజన్లోని సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లను సత్కరించారు.

నెల్లూరు(సెంట్రల్): వలంటీర్ల సేవలు అభినందనీయమని 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు మహేష్ పేర్కొన్నారు. డివిజన్లోని వలంటీర్లకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీటీఎఫ్ జిల్లా కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు (టౌన్): పూలే టీచర్స్ ఫెడరేషన్ (పీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని రైల్వేస్టేషన్ సమీపంలోని కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా పీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, శివనాగు, కిషోర్, మహిళా కార్యదర్శులుగా భారతి, సుదీప్త, కవిత, భారతి, కార్యదర్శులుగా సుధీర్, జయరామయ్య, వెంకటరమణయ్య, రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేష్ నియమితులయ్యారు.



నిర్మాణాలను వేగవంతం చేయాలి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): ప్రభుత్వ ప్రాధాన్యమైన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ప్రభుత్వ భవన నిర్మాణాల పురోగతిపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, తదితర భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు ప్రారంభం కాని భవనాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్, ఈఈ శ్రీనివాసులురెడ్డి, డీఈలు సాంబశివరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

• నాబార్డ్ ద్వారా జిల్లాకు మంజూరై వివిధ దశల్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నాబార్డ్ ద్వారా మంజూరై జిల్లాలో అమలవుతున్న గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి పనులపై తన చాంబర్‌లో సమీక్షించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు మంజూరైన 374 ప్రాజెక్టులకు గానూ 80 పూర్తయ్యాయనే అంశాన్ని గుర్తించామని చెప్పారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. నాబార్డులో మిగిలిన బడ్జెట్‌ను ఉపయోగించుకొని పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నాబార్డ్ డీడీఎం రవిసింగ్, డ్వామా పీడీ వెంకట్రావు, ఫిషరీస్ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరినారాయణన్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఎస్సార్ హాస్పిటల్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ డీఎస్సార్, ప్రగతినగర్ ఫీడర్ల పరిధిలో ఇండోర్ సబ్‌స్టేషన్ పనులను చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

డీఎస్సార్ హాస్పిటల్, లేక్ వ్యూ కాలనీ, ప్రగతినగర్‌లోని ఏ, బీ బ్లాక్‌లు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా ఆదివారం పనిచేయనున్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకట సుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హరినారాయణరెడ్డికి గౌరవ డాక్టరేట్

నెల్లూరు(బృందావనం): సామాజిక సేవలందిస్తున్న హరినారాయణరెడ్డి గౌరవ డాక్టరేట్‌ను శనివారం అందుకున్నారు. తమిళనాడులోని హోసూరులో నిర్వహించిన కార్యక్రమంలో జర్మనీ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నానని ఆయన చెప్పారు.

శ్రీనివాసరావుకు సత్కారం



నెల్లూరు(బారకాసు): మినీబైపాస్ రోడ్డులోని నుడా కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్ట కమిషనర్ శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై వీరు చర్చించుకున్నారు. శ్రీనివాసరావును ద్వారకానాథ్ సత్కరించారు.

వైద్య సిబ్బందికి శిక్షణ



నెల్లూరు(బారకాసు): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శనివారం నిర్వహించారు. హ్యాండ్స్ అండ్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా బేసిక్ కార్డియో పల్మనరీ లైఫ్ సపోర్ట్ (బీసీఎల్ఎస్)పై ఆస్పత్రిలోని అనస్థీషియా విభాగంలో శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకట ప్రసాద్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్, వైద్యాధికారి బ్రహ్మేశ్వర్, అనస్థీషియా విభాగ హెడ్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ జమున, కో ఆర్డినేటర్ సురేష్, అసోసియేట్ ప్రొఫెసర్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుప్రియ పాల్గొన్నారు.

మురళీమోహన్‌రాజుకు ఉత్తమ రచయిత అవార్డు

నెల్లూరు(బృందావనం): పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కవి మురళీమోహన్‌రాజు ఉత్తమ రచయిత అవార్డును అందుకున్నారు. ఇచ్ఛా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చి అకాడమీ ఆధ్వర్యంలో తమిళనాడులోని హోసూరులో నిర్వహించిన కార్యక్రమంలో తనకు అవార్డును అందజేశారని ఆయన చెప్పారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్నకు చెబుదాం'

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఈ మేరకు తిక్కన ప్రాంగణంలో సాక్షితో శనివారం ఆయన మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు గానూ జిల్లాలో ఆయా శాఖల విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిందిగా సూచించామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలను మండల.. సచివాలయ స్థాయిలో ఒక విచారణాధికారి పరిశీలించి పూర్తి నివేదికను ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు అందజేయనున్నారని వివరించారు. సమస్య పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.